AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

1-2-2026 (sunday)

MAIN EDITION

## ముందు వందేమాతరం పాడాలి: కేంద్రం ఆదేశాలు



**అక్షరటుడే, ఢిల్లీ:** జాతీయ గేయం వందేమాతరం విషయంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా పలు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇక నుంచి వందేమాతరం ఆరు చరణాలను పాడాలని పేర్కొంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వందేమాతరం గేయంపై నోటిఫికేషన్ జారీ చేసింది. జనగణమన కంటే ముందే వందేమాతరం పాడాలి. బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం 150వ సంవత్సరాన్ని పురస్కరించుకుని, జాతీయ గీతాన్ని ఆచరించడానికి సమగ్ర మార్గదర్శకాలను నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అధికారిక, బహిరంగ కార్యక్రమాలలో జాతీయ గేయం, జాతీయ గీతాన్ని కలిసి పాడినప్పుడల్లా ముందుగా వందేమాతరం పాడాలని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది.

## బీఎంసీ కార్పొరేషన్ మేయర్‌గా రీతు తావ్డే



**అక్షరటుడే, ముంబై:** బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బీజేపీ కార్పొరేటర్ రీతు తావ్డే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 44 ఏళ్లలో బీజేపీకి చెందిన నాయకులు ఈ పదవిని చేపట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో దాదాపు మూడు దశాబ్దాలుగా బీఎంసీపై శివసేన కొనసాగిస్తున్న ఆధిపత్యానికి ఈ ఎన్నికతో తెరపడింది. అయితే, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన, ఇతర ప్రతిపక్షాలు అభ్యర్థులను నిలబెట్టకపోవడంతో రీతు తావ్డే ఏకగ్రీవమైంది. మరాఠీ అస్తిత్వాన్ని గౌరవిస్తూ మహా యుతి కూటమికి ఉన్న మెజారిటీని దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

## అంబటి రాంబాబుకు బెయిల్



**అక్షరటుడే, ఏపీ:** మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్ లభించింది. పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన కేసులో ఆయనకు ఎక్సైజ్ కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. అదేవిధంగా పోలీసులు వేసిన కస్టడీ పిటిషన్‌ను సైతం కొట్టివేసింది. ఈ మేరకు రూ.10 వేల రెండు పూచీకత్తులు అంబటి సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

## మార్చి 7 వరకు ఏపీ అసెంబ్లీ



**అక్షరటుడే, అమరావతి:** ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశం ముగిసింది. మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని.. అవసరమైతే పొడిగించాలని నిర్ణయించారు. 17 రోజులపాటు అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఈనెల 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో మూడు రోజుల ర్యాలీ తర్వాత స్వల్ప ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. లాభాల స్వీకరణతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. లాభనష్టాల మధ్య ఊగిసలాడాయి. చివరికి సెన్సెక్స్ 40 పాయింట్ల నష్టంతో, నిఫ్టీ 19 పాయింట్ల లాభంతో ముగిశాయి.




## తెలంగాణలో ఐఏఎస్‌ల బదిలీలు

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. మొత్తం 10 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో కీలక నియామకం జరిగింది. ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఇంతకాలం ఇన్‌చార్జ్ సీఎండీగా వ్యవహరించిన కృష్ణ భాస్కర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. అలాగే పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు అదనపు శాఖల బాధ్యతలు కూడా అప్పగించారు. సబ్యసాచి ఘోష్‌కు గిరిజన సంక్షేమ శాఖతో పాటు ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదా కల్పించారు. సందీప్ కుమార్ సుల్తానియాను ప్రణాళిక శాఖతో పాటు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు.



## ఏపీని ఐటీ హబ్‌గా మారుస్తాం : గవర్నర్

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గవర్నర్ నజీర్ అన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ మాట్లాడుతూ.. బలహీన వర్గాలు, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో డిజిటల్ విధానం తీసుకొచ్చామని చెప్పారు. అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నామన్నారు. ప్రస్తుతం 205అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నామని, త్వరలో మరిన్ని ప్రారంభిస్తామన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ద్వారా ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గవర్నర్ తెలిపారు. గిరిజన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

**రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. అక్కడక్కడ చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్ సాఫీగా సాగుతోంది. ఉదయం పోలింగ్ కేంద్రాలకు పెద్దగా జనం రాకపోవడంతో మందకొడిగా ప్రారంభం అయింది. అనంతరం పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 62.09 శాతం పోలింగ్ నమోదైంది. గెలుపు కోసం అన్ని పార్టీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమించారు. తీరా ఓటరు ఎవరిని గెలిపిస్తారోననే ఉత్కంఠ అందరిలో నెలకొంది.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# ఓటెత్తారు..

- మున్సిపల్ ఎన్నికల్లో భారీగా ఓటింగ్
- ఓటేసిన ప్రముఖులు
- పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తతలు
- మధ్యాహ్నం 3 గంటల వరకు 62.09 శాతం పోలింగ్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. పోలింగ్ సందర్భంగా పలు చోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పోలింగ్ కొనసాగుతోంది. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు నోటిఫికేషన్ వెలువడగా.. 14 చోట్ల ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎన్నికయ్యారు. ఒక వార్డులో ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో మిగిలిన చోట్ల ఎన్నికలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 3 గంటల వరకు 62.09శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ పూర్తయ్యేలోపు దాదాపు 80 శాతం ఓటింగ్ నమోదు అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

### పలు చోట్ల ఉద్రిక్తత

మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. చొక్కాలు పట్టుకుని ఇరు పార్టీల కార్యకర్తలు కొట్టుకున్నారు.

- మహబూబాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. 14వ వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం దాడి చేసుకున్నారు.
- కరీంనగర్ 58వ డివిజన్ లో దొంగ ఓట్లు వేస్తున్నారని బీజేపీ నిరసన తెలిపింది. నిరసనకారులను చెదరగొట్టేందులు పోలీసులు లాఠీఛార్జీ చేశారు.
- సంగారెడ్డి మున్సిపాలిటీ 34వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అడ్డు గల్లాను సీఐ పట్టుకున్నారన్న సమాచారంతో జగ్గారెడ్డి పోలింగ్ బూత్‌కు వచ్చారు. పోలింగ్ ఆపేస్తా అంటూ పోలింగ్ బూత్‌లోకి చొచ్చుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది.

### ఓటు వేసిన ప్రముఖులు

సీఎం రేవంత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఓటు హక్కు వినియో గించుకున్నారు. మధిరలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఓటు వేశారు. నాగర్ కర్నూల్ మంత్రి జూపల్లి ఓటు వేశారు.

### అక్కడ ఆగిన పోలింగ్

మహబూబ్‌నగర్ 45వ డివిజన్ 5వ బూత్‌లో దాదాపు 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు తారుమారు అవడంతో పోలింగ్ ఆగిపోయింది. దీంతో అభ్యర్థులు కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. అధికారులు వారితో చర్చించి సమస్యను పరిష్కరించారు. దీంతో మళ్లీ ఓటింగ్ ప్రారంభమైంది.

## మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ హైదరబాద్‌ను మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీని విభజిస్తామని కొంతకాలంగా ప్రభుత్వం చెబుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఇటీవల పోలీస్ కమిషనరేట్లను సైతం పునర్విభజించింది. తాజాగా జీహెచ్ఎంసీని సైబరాబాద్, మల్కాజ్‌గిరి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. ఇటీవల ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధి పెంచింది. నగర శివారులోని 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసింది. అనంతరం వార్డుల సంఖ్యను సైతం పెంచింది. గతంలో జీహెచ్ఎంసీలో 150 వార్డులు ఉండగా.. 300 చేసింది. అయితే శివారు మున్సిపాలిటీల విలీనంపై తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. పరిపాలన వికేంద్రీకరణ చేపట్టాలని, ఇలా దూరంగా ఉన్న ప్రాంతాలను జీహెచ్ఎంసీ విలీనం చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం జీహెచ్ఎంసీని విభజించడం గమనార్హం. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లు ఉంటాయి. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్‌లు ఉంటాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో గతంలోని జోన్లు కొనసాగనుండగా.. పలు జోన్లు కొత్త కార్పొరేషన్లలోకి వెళ్లాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త కార్పొరేషన్లకు ప్రభుత్వం కమిషనర్లను సైతం నియమించింది.

## ప్రైవేట్ స్కూల్‌లో మంటలు



**అక్షరటుడే, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లాలో బుధవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో మంటలు చెలరేగాయి. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో గల శ్రద్ధ ప్రైవేట్ స్కూల్ భవనంలో మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో మంటలు భవనం మొత్తం వ్యాపించాయి. మూడు అంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మొదట మంటలు అంటుకున్నాయి. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

## అమెరికా మా దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా చూసింది



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్ ఖవాజా అమెరికాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ దేశ తన రాజకీయ ప్రాధాన్యాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందన్నారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందని వ్యాఖ్యానించారు. అఫ్గాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన అది పెద్ద తప్పిదమని పేర్కొన్నారు. దీనివల్ల తమ దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందన్నారు.

## ఏపీలో పలువురు మంత్రులకు బెదిరింపులు



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు మంత్రులకు బెదిరింపులు వచ్చాయి. మావోయిస్టుల పేరుతో జాగ్రత్తగా ఉండాలంటూ లేఖలు రావడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. నలుగురు మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, కొల్లు రవీంద్రకు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు వచ్చాయి. జాగ్రత్తగా ఉండాలంటూ అందులో హెచ్చరించారు. ఈ లేఖపై కందుల దుర్గేష్ ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ లేఖలపై అసెంబ్లీ లాబీలో విస్తృత చర్చ జరుగుతోంది. మంత్రులకు బెదిరింపు లేఖలు సంచలనం సృష్టించాయి. కందుల దుర్గేశ్ మంత్రి పేషీకే లేఖ నేరుగా రావడం గమనార్హం. దీంతో ఆయన పీఎస్ శ్రీనివాసరావు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లేఖ ఎక్కడి నుంచి వచ్చింది, మంత్రి పేషీకి ఎలా చేరిందని ఆరా తీస్తున్నారు.

## లావణ్య త్రిపాఠి ఇన్‌స్టా పోస్ట్ వైరల్..



**మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ వేగంగా కొనసాగుతున్నాయి. కాగా.. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా సమ్మర్‌లో రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. దీంతో అప్పడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మెగా కోడలు తాజాగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ సోషల్ మీడియాలో ఓ స్టోరీ పెట్టింది. లావణ్యం తన ఇన్‌స్టాలో చిన్న వీడియో షేర్ చేస్తూ.. 'సతీ లీలావతి ప్రమోషన్స్ బిగిన్స్' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది.**

**—అక్షరటుడే, సినిమాడెస్క్**

## కెనడా స్కూల్‌లో కాల్పులు.. 10 మంది మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కెనడాలోని ఓ స్కూల్‌లో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో 9 మంది విద్యార్థులు మృతి చెందారు. మరో 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. బ్రిటిష్ కొలంబియాలోని టంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌లో కెనడా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో కాల్పులకు పాల్పడిన వ్యక్తి సైతం మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతంలోని ఉన్నత పాఠశాల లోపల ఆరుగురు వ్యక్తులు చనిపోగా, ఒక నివాసంలో మరో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఈ ఘటనపై సంతాపాన్ని తెలిపారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాగా.. కాల్పులు జరపడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాల్పుల ఘటనలో మొత్తం 10 మంది చనిపోయారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.